కరెంట్ పోతే?

- కార్యాలయాల్లో మూలనపడ్డ జనరేటర్లు
- అందుబాటులో లేని ఇన్వర్టర్లు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

గంభీరావుపేట: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలుగకుండా ప్రభుత్వం కొన్నేళ్ల కింద గంభీరావుపేట మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలకు జనరేటర్లు పంపిణీ చేసింది. ఏళ్లు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తేవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ చెట్ల పొదల్లో తుప్పు పట్టిపోతున్నాయి. దీంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. ఇవి ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క సారైనా వాడలేదు. విద్యుత్ కోతల సమయంలో కార్యాలయాల్లో అధికారులతో పాటు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.


మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మూలనపడి ఉన్న జనరేటర్

గంటల తరబడి నిరీక్షించాల్సిందే..

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు కంప్యూటర్లు, ఫ్యాన్లు ఆగిపోయి అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం ఇన్వర్టర్ల సౌకర్యం కూడా లేకపోవడంతో కార్యాలయాల్లో కరెంటు పోయినప్పుడు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మళ్లీ కరెంటు వచ్చేదాకా పనులు కొనసాగడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడం లేదు. మండలంలో కీలకంగా ఉండే తహసీల్దార్ కార్యాలయంలోనూ జనరేటర్ వినియోగంలో లేదు. ఇన్వర్టర్లు మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. అవి కొంత సమయం వరకు మాత్రమే పనిచేస్తున్నాయి. అలాగే మండల పరిషత్, ఐకేపీ, ఎమ్మార్సీలలో నిత్యం బిజీగా ఉంటుంది. కంప్యూటర్లు, ఆన్‌లైన్‌తోనే ఎక్కువగా పనులు సాగుతుంటాయి. ఐతే జనరేటర్లు, ఇన్వర్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కంప్యూటర్లకు యూపీఎస్‌లు ఉన్నప్పటికీ 10 నిమిషాల కంటే ఎక్కువసేపు పనిచేయవు. నిధుల కొరత కారణంగా వాటిని సమకూర్చుకోలేకపోతున్నామని అధికారులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కరెంటు కష్టాలకు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జనరేటర్లను వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వ కార్యాలయానికి సర్టిఫికెట్, ఇతర ఆన్‌లైన్ పనుల కోసం వెళ్లినప్పుడు కరెంటు పోతే, మళ్లీ వచ్చేదాకా నిరీక్షించాల్సి వస్తోంది. కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన జనరేటర్లు తుప్పు పట్టిపోతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. వాటిని వినియోగంలోకి తేవాలి. అలాగే కార్యాలయాల్లో ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– గంట అశోక్, గంభీరావుపేట

ఇబ్బంది పడాల్సి వస్తోంది



కరెంటు పోయినప్పుడు కాస్త ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇన్వర్టర్ లేదు. జనరేటర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. దాని గురించి మాకేం సమాచారం లేదు. దానిని వినియోగించేందుకు తగిన ఏర్పాట్లు కూడా లేవు. ప్రజాప్రతినిధుల, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, గంభీరావుపేట

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు తేజస్విత్



కోనరావుపేట: రాష్ట్రస్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలకు సుద్దాలకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. సిరిసిల్లలోని మినీస్టేడియంలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-14 విభాగంలో కోనరావుపేట మండలం సుద్దాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. తేజస్విత్ కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు మంజులాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ విజయ్‌కుమార్ అభినందించారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన


ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం అడవిపదిర, లాల్‌సింగ్ తండా, బంజేరు గ్రామాల్లో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు కూడా నిజాయితీతో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారి బాలకిషన్, ఆయా గ్రామాల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బోయినపల్లి: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డయల్ 100 సేవలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రుద్రంగి: రుద్రంగి పోలీస్ ఆధ్వర్యంలో డయల్ 100 సేవలపై మండలంలోని గైదిగుట్ట తండా గ్రామంలో గురువారం అవగాహన కల్పించారు. ఏదైనా అనుమానాస్పదంగా కనిపించినా, పరిస్థితులు ఏమైనా అసౌకర్యంగా అనిపించినా, మీరు ఏదైనా ప్రమాదంలో ఉన్నట్లు భావించినా డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి పోలీస్ సిబ్బంది, గైదిగుట్ట తండా గ్రామ ప్రజలు ఉన్నారు.

సమాచారం

మహిళా గురుకులంలో సీట్ల భర్తీకి ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ గిరిజన మహిళ సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాల సిరిసిల్లలో ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను తక్షణ ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రజనీ ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం, సీఏ, బీఎస్సీ లైఫ్‌సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఏ కోర్సులు, బీఏ హానర్స్‌లో ఇంటీరియర్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, ఫొటోగ్రఫీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 95020 82958, 97037 09376 లో సంప్రదించాలన్నారు.

నియామకం

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా షేక్ ఫిరోజ్‌పాషా

కోనరావుపేట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బావుసాయిపేట గ్రామానికి చెందిన షేక్ ఫిరోజ్‌పాషా రెండోసారి ఎన్నికయినట్లు పీసీసీ ప్రకటించింది. తనను నియమించిన డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, అధిష్టానానికి ఫిరోజ్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డెర సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాబు

గంభీరావుపేట: వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్టు సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన పిట్ల బాబు ఎంపికైనట్లు ప్రకటిస్తూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డెర సంఘం అభివృద్ధి కోసం, వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తానని బాబు తెలిపారు.

టీబీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీధర్

బోయినపల్లి: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన గంద్రతి శ్రీధర్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల ఎస్టీయూ శాఖ అధ్యక్షుడిగా తన్నీరు శ్రీనివాస్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



సిరిసిల్లలో విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీజేపీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక విద్యానగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య, పద్మశాలి సంఘం, పాలిస్టర్ అసోసియేషన్, చేనేత వస్త్ర వ్యాపార, సిరిసిల్ల పద్మశాలి సంఘాలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మార్కండేయ భవన్,


ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేటలో కొండా లక్ష్మణ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గూడూరి భరత్, పద్మశాలీ పట్టణ అధ్యక్షుడు తడుక బాలకిషన్ పాల్గొన్నారు.

కుంకుమపూజలు, అన్నదానాలు

చందుర్తి/బోయినపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందుర్తి మండలం మల్యాల, నర్సింగపూర్ గ్రామాల్లో గణనాథుని సన్నిధిలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్యాలలోని 4వ వార్డులో రాజన్న యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ మండపం వద్ద కుంకుమ పూజ నిర్వహించారు. స్వామివారిని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోయినపల్లి మండలంలోని తడగొండ గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అన్నదానాలు చేశారు.


చందుర్తి: మల్యాలలో కుంకుమ పూజ

సీఎం దిష్టిబొమ్మ దహనం


వేములవాడ: తెలంగాణ చౌక్‌లో..


కోనరావుపేట: మర్తనపేటలో

వేములవాడ/కోనరావుపేట/చందుర్తి: వేములవాడ రాజన్న నిధులను కామారెడ్డికి తరలించినందుకు నిరసనగా వేములవాడ తెలంగాణ చౌక్, కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామ అంబేద్కర్ విగ్రహం వద్ద, చందుర్తి మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ బస్టాండ్ ప్రాంతంలో బీజేపీ నాయకులు గురువారం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానానికి రూ.వంద కోట్లు ఇస్తామని 2015 జూన్ 18న ప్రకటించి మోసం చేశారని అన్నారు. వేములవాడ టెంపుల్ నుంచి రూ. 5 కోట్లు, యాదాద్రి ఆలయం నుంచి రూ. 5 కోట్ల నిధులు కామారెడ్డి నియోజకవర్గానికి మళ్లించడం సరికాదన్నారు. వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న రమేశ్‌బాబు ఇప్పటి వరకు ఏం చేయలేదన్నారు. బీజేపీ వేములవాడ మండల అధ్యక్షులు జక్కుల తిరుపతి, గొట్టె రామచంద్రం, పొంచెట్టి రాకేశ్, మండల ఉపాధ్యక్షుడు మోతుకు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పొట్టి తాటి చెట్లు

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారాయణ గౌడ్

తంగళ్లపల్లి: పొట్టి తాటిచెట్లను పెంచడం వలన ప్రమాదాలను నివారించవచ్చని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారాయణగౌడ్ అన్నారు. గురువారం స్థానిక మార్కండేయ దేవాలయంలోని గణేశ్ మండపంలో గీత పారిశ్రామిక సహకార సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాలను అరికట్టేందుకు పొట్టి తాటిచెట్లు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కందుకూరి రామాగౌడ్, గీత పారిశ్రామిక సంఘం నాయకులు సుద్దాల కొండయ్య గౌడ్, బత్తిని నారాయణ గౌడ్, కొడన్నపేట రాజయ్య గౌడ్, బండి పరుశురాం, గొల్లపెల్లి లింగయ్య గౌడ్, సుద్దాల దేవదాస్ గౌడ్, ఆకుల శ్రీనివాస్ గౌడ్, ధర్మేందర్ గౌడ్, గీత సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోడూరు సత్యనారాయణ

విత్తనాలు నాటిన గీత కార్మికులు

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామంలో గురువారం సర్పంచ్ జక్కుల రవీందర్, గీత కార్మికుల ఆధ్వర్యంలో పొట్టి తాటిచెట్ల విత్తనాలను నాటారు. సర్పంచ్ రవీందర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజుయాదవ్, గీత కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

కోనరావుపేట: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే తల్లిదండ్రులు తమ చిన్నారులకు వాహనాలు ఇవ్వొద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకుని నడపాలని, అలాగే వాహనానికి సంబంధించిన లైసెన్స్‌తో పాటు అన్ని రకాల ధ్రువీకరణపత్రాలు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలి


వేములవాడరూరల్: ఫాజుల్‌నగర్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న రాష్ట్ర నాయకులు

వేములవాడరూరల్/వేములవాడఅర్బన్: ప్రభుత్వం సాధారణ ఎన్నికల లోపే వేతన సవరణ కమిటీని నియమించి వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి, రుద్రవరం, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, బాలరాజుపల్లి, వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో బదిలీలు, పదోన్నతుల ఖాళీల్లో 317 జీవో ద్వారా స్థానికత నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటకం రవికుమార్, అనిల్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

నూతన అధ్యక్షులకు సన్మానం

వేములవాడ: వేములవాడ పట్టణ పట్టణ అధ్యక్షుడిగా చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, వేములవాడ అర్బన్ అధ్యక్షులుగా పిల్లి కనుకయ్య, కోనరావుపేట మండల అధ్యక్షులుగా షేక్ ఫిరోజ్‌పాషాలను ఆపార్టీ నాయకులు గురువారం ఆది శ్రీనివాస్ నివాసంలో సన్మానించారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- లంబాడీ ఐక్య వేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్

కోనరావుపేట: గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలిచ్చి నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని లంబాడీ ఐక్య వేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. కోనరావుపేటలో గురువారం మాట్లాడుతూ జైసేవాలాల్ భుక్యారెడ్డితండాలో 82 పోడు భూముల పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 50 మందికే పట్టాలిచ్చారని అన్నారు. మిగతా 32 మందికి రాలేదన్నారు. వారంతా కలెక్టర్‌ను కోరగా రీసర్వేకు చేయాలని అధికారులను ఆదేశించారని, ఇప్పటివరకు అధికారులు సర్వే చేయలేదన్నారు. పట్టాలు లేవన్న సాకుతో అటవీ అధికారులు ప్లాంటేషన్‌కు ప్రయత్నాలు చేయగా గిరిజన మహిళలు అడ్డుకున్నారన్నారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు ఎలాంటి సంబంధం లేని తనను ఏ1గా పేర్కొన్నారని వాపోయారు. అధికారులు స్పందించి గిరిజనుల భూములకు పట్టాలిచ్చి, 11 మందిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న నరేశ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

డబుల్ లబ్ధిదారులుగా 62 మంది గుర్తింపు

ముస్తాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపడుతున్నామని డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ అన్నారు. మండలంలోని గూడెంలో లబ్ధిదారుల ఎంపికకు గురువారం సర్పంచ్ చిట్నేని సరిత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 240 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వాటిలో అర్హులుగా 62 మందిని గుర్తించడం జరిగిందని తెలిపారు. కాని డబుల్ బెడ్రూం ఇళ్లు 48 మాత్రమే ఉండడంతో మరోసారి రెవెన్యూ విచారణ చేయాలని తీర్మానించామన్నారు. 14 మందికి గృహలక్ష్మిలో మొదటి విడత ప్రాధాన్యత కల్పించేందుకు తీర్మానించారు. ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, ఆర్ఐ శ్యాం, సెస్ మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రావు, ఎల్లం, శంకర్, మల్లేశ్ పాల్గొన్నారు.

24న అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన

సిరిసిల్లకల్చరల్: రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితచరిత్ర ఆధారంగా రూపొందిన సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన ఈ నెల 24న ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. నర్సింగ్ కళాశాల పక్కన గల అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఈ నెల 25న వేములవాడలోని బింగి ఫంక్షన్ హాల్‌లో కూడా ప్రదర్శిస్తామన్నారు. జిల్లా ప్రజలు ప్రదర్శనకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ సరిత, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, డీటీ సురేశ్, ఆర్ఐ శ్యామ్, శ్రీనివాస్‌రావు, మల్లేశ్ పాల్గొన్నారు.

శిథిలమైన కల్వర్టులు బాగుచేయాలి

బోయినపల్లి: మండలంలో శిథిలమైన లోలెవల్ కల్వర్టులను హైలెవల్ బ్రిడ్జిలుగా నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శిథిలమైన లోలెవల్ వంతెనలను స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఉదారి నర్సింహాచారి, సుంపాక ప్రభు, సారంపెల్లి రాజు, కల్యాణం అనీల్, బాలయ్య పాల్గొన్నారు.

25న హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతు దినోత్సవం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలో బలరాముని జయంతిని పురస్కరించుకొని రైతు దినోత్సవంలో భాగంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. బీకేఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా

బోయినపల్లి/తంగళ్లపల్లి: బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి, తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామాల్లో గురువారం స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మహిళలతో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి, శ్రమదానం చేశారు.

ఏఐఎస్ఎఫ్ గర్జన సభకు తరలిరండి

వీర్నపల్లి: జిల్లా కేంద్రంలో అక్టోబర్ 6న జరిగే ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల గర్జన సభను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంజిత్ అన్నారు. నాయకులు మనోహర్, దేవదాస్, వంశీ, వైష్ణవి, నవ్య, సంధ్య, సౌమ్య పాల్గొన్నారు.

పరామర్శ

ముస్తాబాద్: ముస్తాబాద్ మాజీ పట్వారి మట్ట పాపిరెడ్డి(86) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమారులు రాజేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గురువారం పరామర్శించారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, బీజేపీ పట్టణాధ్యక్షుడు మహేందర్, రమేశ్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో రాణించిన విలాసాగర్ బాలికలు


విలాసాగర్ వాలీబాల్ క్రీడాకారులు

బోయినపల్లి: జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) వాలీబాల్ పోటీల్లో మండలంలోని విలాసాగర్ హైస్కూల్ బాలికలు సత్తా చాటి జిల్లాలో రెండోస్థానం సాధించారు. గురువారం జరిగిన పోటీల్లో మొదటి స్థానం ఎల్లారెడ్డిపేట జట్టు కైవసం చేసుకోగా, విలాసాగర్ జట్టు రెండో స్థానం పొందింది. రెండోస్థానం సాధించిన క్రీడాకారులను హైస్కూల్ హెడ్‌మాస్టర్ బొలుగం శ్రీనివాస్, బోయినపల్లి పీడీ. సీహెచ్ సంపత్‌రావు, పీఈటీ మధుకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లు వాడటం, ర్యాగింగ్, వేధింపులు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాలికలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం అధికారులు అంజయ్య, ప్రమీల, శాంతి, రమాదేవి, ప్రియాంక పాల్గొన్నారు.